క్లుప్తంగా

ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఎంపిక

తిరుపతి కల్చరల్: ఆటో వర్కర్స్ యూనియన్ తిరుపతి జిల్లా కమిటీని ఎంపిక చేసినట్లు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి తెలిపారు. యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడిగా కె.రాధాక్రిష్ణ, అధ్యక్షుడిగా ఎస్.పురుషోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.శివ, ఉపాధ్యక్షులుగా నారాయణ, ప్రమీల, సహాయ కార్యదర్శులుగా శ్రీనివాసులు, ఎం.వెంకటేష్, కోశాధికారిగా కంబాల సూరి ఎంపికయ్యారు.

వేడుకగా స్ట్రాబెరీ డే



స్ట్రాబెరీ ఫ్రూట్ వేషధారణలో సాయిసుధా స్కూల్ విద్యార్థులు

తిరుపతి రూరల్: తుమ్మలగుంట నలందానగర్‌లోని శ్రీసాయి సుధా ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో బుధవారం స్ట్రాబెరీ డేను ఘనంగా నిర్వహించారు. వివిధ తరగతులకు చెందిన విద్యార్థులు స్ట్రాబెరీ ఫ్రూట్ వేషధారణలో ఆకట్టుకున్నారు. స్ట్రాబెరీ తినడం వల్ల కలిగే లాభాలను పాఠశాల నిర్వాహకులు వివరించారు. అభిషేక్, ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, అకడమిక్ ప్రిన్సిపాల్ వెంకటకృష్ణ, మేనేజర్ పుష్ప పాల్గొన్నారు.

అపజయాలను విజయానికి పునాదులుగా మలుచుకోవాలి

తిరుపతి ఎడ్యుకేషన్ : అపజయాలకు కుంగిపోకుండా వాటినే విజయానికి పునాదులుగా మలుచుకోవాలని రీ డాక్ హీలింగ్ సెంటర్ వ్యవస్థాపకురాలు టి.అనుపమ తెలిపారు. తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం హ్యాండ్లింగ్ ఫెయిల్యూర్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని నిర్దేశించుకుని వాటి సాధనకు క్రమశిక్షణ, పట్టుదలతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఓటమి వెనుక విజయం దాగుంటుందన్న సత్యాన్ని గ్రహించిన వారే విజేతలుగా నిలుస్తారని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ వై.ద్వారకనాథరెడ్డి, మెకానికల్ విభాగాధిపతి శైలజ, ఎం.హరిప్రసాద్ పాల్గొన్నారు.

మెకానిక్‌లకు జరిమానా విధింపులపై వెసులుబాటు

తిరుపతి కల్చరల్: టెస్ట్ రైడ్ సమయంలో మెకానిక్‌లకు జరిమానా విధింపుపై పోలీసులు అధికారులు వెసులుబాటు కల్పించినట్లు తిరుపతి టూవీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. టూవీలర్స్ రిపేర్ అనంతరం టెస్ట్ రైడ్ చేస్తున్న సమయంలో మెకానిక్‌లకు పోలీసులు జరిమానా విధిస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని డెప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి దృష్టికి తీసుకెళ్లామని, ఆయన ట్రాఫిక్ డీఎస్పీతో చర్చించి జరినామా సమస్యలను పరిష్కరించాలని సూచించారని తెలిపారు. టెస్ట్ రైడ్ సమయంలో మెకానిక్‌లకు జరిమానా లేకుండా చర్య లు తీసుకుంటామని డీఎస్పీ హామీ ఇచ్చారని తెలిపారు. 18 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయ స్సు ఉన్న మెకానిక్‌లు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు యూనియన్ గుర్తింపు కార్డులు కలిగి ఉన్న వారికి టెస్ట్ రైడ్‌లో జరిమానా విధించబోమని ట్రాఫిక్ డీఎస్పీ తెలిపారని పేర్కొన్నారు. సమస్య ల పరిష్కారానికి కృషి చేసిన డెప్యూటీ మేయర్ భూమ న అభినయరెడ్డి, ట్రాఫిక్ డీఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాలి



ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు

పాకాల : అర్హులందరికీ సంక్షేమ పథకాల అందాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని చేపట్టిందని జెడ్పీటీసీ నంగా పద్మజారెడ్డి తెలిపారు. మండలంలోని పంటపల్లి పంచాయతీలో బుధవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంచాయతీలోని ప్రజలకు 477 ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నంగా నరేష్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు కపిలేశ్వర్ రెడ్డి, సర్పంచ్ సుబ్రమణ్యం, ఎంపీడీవో ప్రభాకర్, తహసీల్దార్ భాగ్యలక్ష్మి, ఈఓపీఆర్డీ మాలతి, కార్యదర్శి మురళీకృష్ణ పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ధ్యేయం

- సంక్షేమ పథకాలే తిరిగి గెలిపిస్తాయి
- ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి
- 7వ డివిజన్‌లో గడప గడపకూ మన ప్రభుత్వం



తిరుమల వ్యాపారుల సమస్యను పరిష్కరించినందుకు ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న కోలా మునిసుబ్రమణ్యం

తిరుపతి మంగళం : ప్రజల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి తెలిపారు. ఆయన బుధవారం మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణతో కలిసి తిరుపతి 7వ డివిజన్ సంజయ్‌గాంధీకాలనీలో వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు చిమట రమేష్, టౌన్ బ్యాంకు చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గడప గడపకూ వెళ్లి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. తిరుమల వ్యాపారులు మాట్లాడుతూ తిరుమలలో తమ దుకాణాల లైసెన్స్‌ల రెన్యువల్‌తోపాటు క్రయ విక్రయాలు జరిగిన దుకాణాల పేరు మార్పిడి తదితర సమస్యలు పరిష్కారం కాక 40 ఏళ్లుగా ఇబ్బంది పడ్డామని తెలిపారు. సమస్యను ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి పరిష్కరించి తమ జీవితాల్లో వెలుగులు నింపారని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో జగనన్నను, తిరుపతిలో భూమన అభినయ్‌రెడ్డిని గెలిపించుకుని రుణం తీర్చుకుంటామని చెప్పారు. ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి మాట్లాడుతూ జగనన్న పేదలకు అందజేసిన సంక్షేమ పథకాలే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని తిరిగి గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జగనన్నకు వస్తున్న ప్రజాదరణను చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు విమర్శలకు దిగుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పుల్లూరు అమరనాథ్‌రెడ్డి, టి.మునిరామిరెడ్డి, రామస్వామి వెంకటేశ్వర్లు, టౌన్ బ్యాంకు డైరెక్టర్లు కాసీం, వెంకటేష్‌రాయల్, పాముల రమేష్‌రెడ్డి, నైనారు శ్రీనివాసులు, తాలూరి ప్రసాద్, బి.రవిచంద్రారెడ్డి, ధనశేఖర్, జగదీష్, ఈశ్వర్, పురుషోత్తం, అముల్‌బాబు, నాదముని, శ్యామల పాల్గొన్నారు.

ఆరోగ్య చంద్రగిరే లక్ష్యం



ఎంఎం కండ్రిగలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ : ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు చేయించి చంద్రగిరిని ఆరోగ్య నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని వైఎస్సార్ సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం బ్రాహ్మణపట్టు పంచాయతీ మిట్టమీద కండ్రిగలో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంప్‌ను పరిశీలించారు. ప్రజలకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం తుడా సెక్రటరీ లక్ష్మితో కలిసి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఆయన మాట్లాడుతూ కరోనా తరువాత శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ఈ క్రమంలో ప్రజలందరూ తప్పక వైద్య పరీక్షలు చేయించుకుని అవసరమైన మందులు వాడాలని సూచించారు. వైద్య సేవలకు విచ్చేసిన ప్రజలకు ఉచితంగా ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశామని వివరించారు. వైస్ ఎంపీపీ విడుదల మాధవ రెడ్డి, సర్పంచ్ నాగజ్యోతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు సుబ్రమణ్యం రెడ్డి పాల్గొన్నారు.

పాతూరు గంగమ్మకు మోహిత్‌రెడ్డి సారె సమర్పణ



సారె తీసుకువస్తున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: మండలంలోని బ్రాహ్మణపట్టు పంచాయతీ పాతూరులో నడివీధి గంగమ్మ జాతరను బుధవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి బుధవారం సారె సమర్పించారు. ఊరేగింపుగా వచ్చిన ఆయనకు సర్పంచ్ నాగజ్యోతి, వైఎస్సార్ సీపీ నాయకుడు సుబ్రమణ్యంరెడ్డి, మాజీ ఎంపీటీసీ వేణు, గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు మునస్వామి రెడ్డి, ఢిల్లీరెడ్డి పాల్గొన్నారు.

కార్గిల్ అమర వీరులకు ఘన నివాళి



కపిలతీర్థం సమీపంలోని అమర జవాన్ స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు



జవాన్లను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

తిరుపతి కల్చరల్/తిరుపతి గాంధీ రోడ్ : కార్గిల్ విజయ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని తిరుపతి జిల్లా మాజీ సైనికుల బృందం బుధవారం కపిల తీర్థం సమీపంలోనున్న అమర జవాన్ జ్యోతి స్థూపం వద్ద అమర వీరులకు ఘనం నివాళులర్పించారు. రిటైర్డ్ కల్నల్ జి.చంద్రశేఖర్ నాయుడు మాట్లాడుతూ 1999 జూలై 26న భారత్ భూభాగాన్ని ఆక్రమించుకోవడానికి ప్రయత్నించిన పాకిస్తాన్ సైన్యాన్ని మన సైన్యం తరిమికొట్టిందన్నారు. 60 రోజులు జరిగిన ఈ యుద్ధంలో 527 మంది భారత సైనికులు అమరులయ్యారని తెలిపారు. వారి త్యాగాన్ని గుర్తు చేసుకుంటూ అమరవీరుల దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని వివరించారు. అనంతరం వెరిటాస్ సైనిక్ స్కూల్ విద్యార్థులు చేపట్టిన కవాతు ఆకట్టుకుంది. కార్యక్రమంలో జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ విజయశంకర్‌రెడ్డి, ఈఎస్ఎం అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పి.ఆనందరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎస్.గోపాల్, హౌసింగ్ బోర్డు అధ్యక్షుడు ఎంఆర్.రెడ్డి, వెరిటాస్ సైనిక్ స్కూల్ అధినేత శేషారెడ్డి, ఐవీవో అధ్యక్షుడు చంద్రారెడ్డి, రేణిగుంట ఈఎస్ఎం అధ్యక్షుడు అముల్ నాయుడు, బాయ్స్ హాస్టల్ మేనేజర్ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

మాజీ సైనికులకు రంగస్థలి సత్కారం

కార్గిల్ దినోత్సవం సందర్భంగా బీజేపీ జిల్లా సాంస్కృతిక విభాగం కన్వీనర్ గుండాల గోపీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం సైన్యంలో 17 ఏళ్లు వివిధ సర్వీసుల్లో సేవలందించిన హరికృష్ణ యాదవ్, చిన్న రెడ్డెప్ప, రూపేష్ నాయుడును ఘనంగా సత్కరించారు. అంతకుముందు అమరవీరుల స్థూపం వద్ద అమరులకు పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు సుబ్రమణ్యంరెడ్డి, విజయకుమార్‌రెడ్డి, మస్తాన్, కట్టమంచి చంద్రబాబు, కేశవ్ పాల్గొన్నారు.

రోడ్డు ఏర్పాటుకు అనుమతి ఇవ్వొద్దు

తిరుపతి సిటీ: ఎస్వీ యూనివర్సిటీని అనుసంధానిస్తూ పబ్లిక్ రోడ్డు వేయడానికి అనుమతి ఇవ్వొద్దని ఎస్వీయూ నాన్ టీచింగ్ అసోసియేషన్ నాయకులు కోరారు. వారు బుధవారం ఎస్వీయూ రిజిస్ట్రార్ మహ్మమద్ హుస్సేన్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఇటీవల తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఎస్వీయూ నుంచి నగరంలోకి పబ్లిక్ రోడ్డు వేయాలని సర్వే చేశారని తెలిపారు. రోడ్డు వేయడం ద్వారా వర్సిటీ ఆవరణలో అసాంఘిక శక్తులు పాగా వేసే ప్రమాదముందన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు పీకే సుబ్రమణ్యం, కార్యదర్శి ఎస్.సుబ్రమణ్యం, వెంకటేశ్వర్లు, రమణ, మనోజ్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

చంద్రగిరి ఏరియా ఆస్పత్రికి వైద్య పరికరాలు వితరణ



వైద్య పరికరాలు అందజేస్తున్న ఫార్మాస్యూటికల్ కంపెనీ సిబ్బంది

చంద్రగిరి(తిరుపతి రూరల్): తిరుపతి జిల్లా శ్రీసిటీలోని వెస్ట్ ఫార్మాస్యూటికల్ ప్యాకేజింగ్ కంపెనీ చంద్రగిరి ఏరియా ఆస్పత్రికి రూ.10 లక్షల విలువైన వైద్య పరికరాలను వితరణ చేసింది. వాటిని కంపెనీ సిబ్బంది ఆర్ముగం, శ్రీహరి, ముఖేష్ బుధవారం ఆస్పత్రి కమిటీ సభ్యులు రెడ్డెప్ప, మమత, అచ్యుతరెడ్డి, సూపరింటెండెంట్ హరిప్రసాద్‌కు అందజేశారు. కంపెనీ సిబ్బంది ఆర్ముగం మాట్లాడుతూ సామాజిక బాధ్యతలో భాగంగా ప్రతి ఏటా కంపెనీ తరపున రూ.10 లక్షల విలువైన పరికరాలను ఆసుపత్రులకు అందజేస్తున్నట్టు తెలిపారు. ఈ ఏడాది చంద్రగిరి ఆస్పత్రికి రెండు ఈసీజీ మెషిన్లు, నాలుగు ఎమర్జెన్సీ బెడ్స్, నాలుగు సెక్షన్ ఆపరేటర్ మెషిన్లు, బయో మెడికల్ వేస్ట్ ట్రాలీ, బీపీ బిలేటర్, మరో రెండు పరికరాలు ఇచ్చాన్నారు. వారిని ఆస్పత్రి కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు.

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి

భాకరాపేట : రైతులు తాము సాగుచేసిన పంటల నమోదు తప్పనిసరి అని చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాళెం వ్యవసాయాధికారులు ధనలక్ష్మి, ఖాదర్‌బాషా తెలిపారు. ఆయా మండల కేంద్రాల్లో బుధవారం ఈ క్రాప్ నమోదుపై శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటను ఈ–క్రాప్ బుకింగ్ చేయడం ద్వారా వైఎస్సార్ ఉచిత పంటల బీమా, సున్నా వడ్డీ, పంట సేకరణ, పంట రుణాలు, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర ప్రభుత్వ పథకాలకు అర్హత లభిస్తుందని పేర్కొన్నారు. రైతులు ఆగస్టు 15వ తేదీలోపు ప్రతి పంటనూ నమోదు చేసుకునేల చూడాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సెరికల్చర్ అధికారి గీతారాణి, హార్టికల్చర్ అధికారిణి శివకుమారి, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, వీఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

వేధింపుల కేసులో ఇద్దరికి జైలు శిక్ష

తిరుపతి లీగల్ : వేధింపుల కేసులో ఇద్దరికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తిరుపతి నాలుగో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. వైఎస్సార్ కడప జిల్లా పెండిమర్రి మండలం మల్లయ్యపల్లికి చెందిన పి.మల్లికార్జునరెడ్డి తిరుపతి గాలి వీధిలో ఉంటున్నాడు. తిరుపతి గాంధీపురానికి చెందిన పి.రామానుజమ్మను 2004 జూన్ 14న ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఆమె పుట్టుకతో అంధురాలు. ఆమె టీటీడీలో జూనియర్ అసిస్టెంటుగా విధులు నిర్వహించేవారు. వారికి ఇద్దరి సంతానం. మల్లికార్జునరెడ్డికి 2007లో టీటీడీ ఏడీ బిల్డింగ్‌లో ఎంపీడబ్ల్యూగా ఉద్యోగం వచ్చింది. అదనపు కట్నం తీసుకురావాలని అతను, తన తల్లి, చెల్లెలుతో కలిసి భార్యను వేధించేవాడు. దీంతో ఆమె తన పేరున ఉన్న స్థలాన్ని అమ్మి రూ.5 లక్షలు ఇచ్చింది. అతను తిరుపతి కర్నాల వీధికి చెందిన ఎం.లక్ష్మీ అలియాస్ ఆర్.లక్ష్మీతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ క్రమంలోనే ఇల్లు కొనేందుకు రామానుజమ్మ తన బంగారు నగలు, స్థలాన్ని అమ్మి రూ.8 లక్షలు ఇచ్చింది. ఆ డబ్బుతో తిరుపతి గాంధీపురంలో ఇంటిని కొని 2016 జనవరి 21న గృహ ప్రవేశం చేశారు. రామానుజమ్మను ఇంటిలోకి రానీయకుండా లక్ష్మీతో గృహ ప్రవేశం చేయించారు. దీనిపై రామానుజమ్మ మహిళా స్టేషన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అతనికి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆ నలుగురు కలిసి ఆమెను వేధిస్తుండడంతో 2017 మే 8న రామానుజమ్మ మళ్లీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేసి మల్లికార్జునరెడ్డితో పాటు మిగిలిన ముగ్గురిపై కేసు నమోదు చేశారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి మొదటి నిందితుడిగా ఉన్న మల్లికార్జునరెడ్డికి ఏడాదిన్నర జైలు శిక్ష, రూ.1,000 జరిమానా, నాలుగో నిందితురాలిగా ఉన్న ఎం.లక్ష్మి అలియాస్ ఆర్.లక్ష్మీకి 6 నెలలు జైలు శిక్ష, రూ.1,000 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. మిగిలిన ఇద్దరిపై కేసును కొట్టి వేశారు.



వర్షాకాలం ప్రారంభం కావడంతో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు అప్రమత్తమయ్యారు. నగరంలోని మురుగు కాలువలపై దృష్టిసారించి పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపును చేపట్టారు. ఇందులో భాగంగా డీఆర్ మహల్ సమీపంలోని పెద్ద కాలువలో బుధవారం మున్సిపాలిటీ సిబ్బంది చెత్త, ప్లాస్టిక్ వ్యవర్థాలను తొలగించారు. మురుగు కాలువలు నిండి రోడ్లపై నీరు ప్రవహించకుండా, ప్రజలకు అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంపై ప్రజలు సిబ్బందిని, అధికారులను అభినందిస్తున్నారు. - సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

అనుమానితుల సమాచారం ఇవ్వండి



మాట్లాడుతున్న రైల్వే సీఐ మధుసూదన్

తిరుపతి అర్బన్: ఆధ్యాత్మిక నగరం తిరుపతి రైల్వే స్టేషన్‌కు దేశవిదేశాల నుంచి ప్రయాణికులు వచ్చిపోతుంటారని, అనుమానాస్పద స్థితిలో ఎవరైనా కనిపిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని రైల్వే సీఐ మధుసూదన్ కోరారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లో రైల్వే పోలీసులు, ఎస్‌బీఐ నేతృత్వంలో బుధవారం ఆటో, ట్యాక్సీ డ్రైవర్లతో అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి అదనపు చార్జీలను వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రైల్వే స్టేషన్‌తోపాటు సమీప ప్రాంతాల్లో తప్పిపోయిన పిల్లలు, పెద్దలను గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ ఎల్ఎన్ మూర్తి, మేనేజర్ మోహన్ మాట్లాడుతూ తమ బ్యాంక్‌లో పర్సనల్, హౌసింగ్, వాహనాల కొనుగోలుకు రుణాలు ఇస్తున్నట్టు తెలిపారు. ఎస్‌బీఐ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రణధీర్‌పురంలో కొబ్బరి మొక్కల పంపిణీ



కొబ్బరి మొక్కలు పంపిణీ చేస్తున్న లక్ష్మీనారాయణ, సర్పంచ్ లీలావతి

తిరుపతి మంగళం : ప్రతి ఇంటా మొక్కలు పెంచడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని నివారించవచ్చని మంగళం రణధీర్‌పురం వైఎస్సార్‌సీపీ పంచాయతీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ తెలిపారు. రణధీర్‌పురం సచివాలయం వద్ద బుధవారం కొబ్బరి మొక్కలు పంపిణీ చేశారు. ప్రతి ఇంటా మొక్కలు పెంచితే రోగాలే దరికి రావన్న ఆలోచనతో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ప్రతి ఇంటికీ రెండు కొబ్బరి మొక్కలను ఉచితంగా అందజేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లీలావతి, ఉపసర్పంచ్ ఉమాపతి, కార్యదర్శి రాజేష్, వార్డు సభ్యులు సతీష్, మురళి, బాష, భాస్కర్, సురేంద్ర, సోమశేఖర్, సుధా యాదవ్ పాల్గొన్నారు.

మణిపూర్ బాధితులకు సంఘీభావంగా క్యాండిల్ ర్యాలీ



ర్యాలీ చేస్తున్న ఎన్‌జీవోలు, మణిపూర్ బాధితుల సంఘీభావ కమిటీ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: మణిపూర్ బాధితులకు సంఘీభావం తెలుపుతూ బుధవారం సాయంత్రం ఎస్వీ మెడికల్ కళాశాల ఎదురుగానున్న వివేకానంద సర్కిల్‌లో కొవ్వొత్తుల ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా మణిపూర్ బాధితుల సంఘీభావ కమిటీ కన్వీనర్ మల్లారపు నాగార్జున మాట్లాడుతూ మహిళలను నగ్నంగా ఊరేగిస్తూ లైంగిక దాడికి పాల్పడిన దుండగులను కఠినంగా శిక్షించాలన్నారు. మణిపూర్‌లో శాంతిని నెలకొల్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టెంకాయల దామోదరం, వెంకటరమణ, ఐద్వా సాయిలక్ష్మి, జయంతి, కిరణ్, మునిరత్నం, శాంబోలు హరినాథ్, బాలాజీ, నారాయణ, సుంకర రెడ్డెప్ప, సాకం నాగరాజు, నెమలేటి కిట్టన్న పాల్గొన్నారు.

సునీల్ చక్రవర్తికి సత్కారం



సునీల్ చక్రవర్తిని సత్కరిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రవాణా శాఖ సభ్యుడిగా నియమితులైన సునీల్ చక్రవర్తిని ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ అభ్యుదయ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో ప్రతినిధులు బుధవారం ఘనంగా సత్కరించారు. అనంతరం ఆయనతో రవాణా శాఖ ఉద్యోగుల సమస్యలపై చర్చించారు. ఉద్యోగులకు అండగా ఉంటామని సునీల్ చక్రవర్తి తెలిపారు. హిమగిరి, దుర్వాసులు, బెల్లంకొండ సురేష్, రాజేంద్ర, రామారావు తదితరులు పాల్గొన్నారు.



ఫ్లాష్.. ఫ్లాష్.. ఫ్లాష్

శ్రీనివాస సేతు నిర్మాణంలో అపశ్రుతి

- ఇద్దరు కార్మికుల దుర్మరణం





సిమెంటు గడ్డర కింద కార్మికుడి మృతదేహం





తిరుపతి క్రైమ్: ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన శ్రీనివాస సేతు వంతెన నిర్మాణం చివరి దశలో అపశ్రుతి చోటుచేసుకుంది. తిరుపతి నగరంలోని రిలయన్స్ మార్ట్ ఎదురుగా వంతెనపై బుధవారం అర్ధరాత్రి వంతెన నిర్మాణ పనుల్లో భారీ ప్రమాదం చోటుచేసుకుంది. చివరి సిమెంటు గడ్డర(సెగ్మెంట్) ఏర్పాటు చేస్తున్న క్రమంలో క్రేన్ వైర్లు తెగిపోయాయి. దీంతో ఆ సిమెంట్ గడ్డర కూలిపోయింది. ఈ ఘటనలో ఆఫ్కాన్స్ సంస్థకు చెందిన కార్మికులు ఇద్దరు దుర్మరణం చెందారు. మృతులు పశ్చిమబెంగాల్‌కు చెందిన అవిజిత్, బిహార్‌కు చెందిన బార్థోమండల్‌గా గుర్తించారు. ఈ మేరకు తిరుపతి ఈస్ట్ సీఐ మహేశ్వర్ రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మరో వారంలో పూర్తి స్థాయిలో వంతెన నిర్మాణం పూర్తి కానుంది. ఈ క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకోవడం దురదృష్టకరమని చెప్పారు.

